# తాటక



ఏకాంకిక

శ్రీ జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రి

౧

[ఆశ్రమభూమి. మహర్షి విశ్వామిత్రుడూ, ఆయన శిష్యుడు అరిందముడూ]

అరిందముడు: మహర్షీ ! యింతగా ఆలోచిస్తున్నారు. ఒక్క మీ క్రోధారుణ నేత్రజ్వాల చాలదా ఈ తాటక ప్రాణాలకు ?

విశ్వా: [నవ్వుతాడు].

అరిం: ఒక్క ఆడుదానికోసం యిలా గురుదేవులు చింతావ్యగ్రులు కావడం యిదే మొదలేమో ?

విశ్వా: పసివాడా ! ఆమె సామాన్యకాదు. వెయ్యి ఏనుగుల బలముకలది.

అరిం: ఆఁ ?

విశ్వా: అంతేనా! ఇతరులకు అపకారమే చేయనిది. భక్తురాలు !

అరిం: శత్రువులను మెచ్చుకుంటున్నారు, గురూ !

విశ్వా: శత్రువులలోని సుగుణసంపత్తిని చూడలేకపోవటం పురాకృత మహాపాపఫలం ! నాయనా, తాటక చేసిన అపకారమేమీ లేదు. కానీ, ఆమె యీ యిలాతలిలో ఉండగూడనిది. ఆమె జీవించే ఉన్నచో మన జాతికి మోక్షముండదు నాయనా !

అరిం: మహర్షీ ! శపించరాదూ—ఒక్క శాపవాక్యమూ ఒక్క శాపజలబిందువు చాలదా ? ఆమెను-భస్మీకరించుటకు !

విశ్వా: నిజమే. నాయనా, నాలోయింకను రాచరికపు రక్తపటిమ చచ్చిపోలేదురా. ఆమె చేసినపనులకు సరియగు కారణములాఉన్నవి. పైగా, ఆమెఅంటే నా హృదయము భగ్గుమనుటలేదు. హృదయము భగ్గుమని మండనిదీ శాపవాక్కులు రావు, శాపజలబిందువులు బ్రహ్మాస్త్రములున్నూ కావు. (కాస్త ఆగి) నాయనా, మనజాతికి ఈమె కాళరాత్రి వంటిది. మనజాతికి రానున్న చెట్టకు, శాంతిక్రియగా, ఆమెమీద పగగాని, మరొకటి కాదు. రాజనీతికి రాజనీతియే సరియయినది. క్షాత్రబలముతోనే ఆయమ మడియింపదగినది.

అరిం: రాజకుమారులే కదూమీరు గురూ !

విశ్వా: నేను రాచరికమునువదలి బ్రహ్మర్షినికా గోరుచుంటిని. రాచరికమునందు అజయ్యుడు కాగోరువాడే దీనికి తగినవాడు. ఆ అయోధ్యరాకుమారుడు-

అరిం: రాముడు.

విశ్వామిత్రు: ఆఁ! ఆరాముడే ఈ తాటకాకాళరాత్రికి ప్రత్యూషము. అవిగో, అనుకూల మందమారుతములు. నేను అయోధ్యకు పోయివత్తును. ఆశ్రమము జాగ్రత్త.

అరిం: శ్రద్ధగా కాపాడగలను.

౨

[తాటక, కుమారుడు మారీచుడు]

మారీచుడు: అమ్మా, మన్ని దొంగలంటున్నారమ్మా. బానిసలంటున్నారమ్మా. ఆ పచ్చనివాళ్లు, ఆ దీర్ఘభుజులు, ఆ వెడద రొమ్మువాళ్లు, ఆ గరుడముక్కులవాళ్లు, ఆపిరికివాళ్ళు!—

తాటకి: పిరికివాళ్లా- ?

మా: అవునమ్మా. నిన్న నేను, యిప్పపూలు ఎండబెట్టుకుంటూంటే, మా లేడిపిల్ల యిలా వచ్చిందా అంటూ వచ్చాడమ్మా. వచ్చి, యిప్పపువ్వు ఎలావుంటుందన్నాడు!

తాట: నీవేమి అన్నావు నాయనా!

మారీ: శివదేవతాకమైన ఆర్ద్రానక్షత్రంలా గుంటుందన్నానమ్మా. వాడు, ఆగడ్డాలవాడు పకపకా నవ్వాడు. యిప్పపూలు, కృత్తికా నక్షత్రములవలె లేవా అన్నానమ్మా. ఆ గడ్డాలవాడు,ఆఋషి-మరి మీరు రాక్షసులు గదా, "శివుడంటే ఏమిట"న్నాడు.

తాట: ద్వేషమువల్ల, గుడ్డివాడైనాడులే.

మారీ: మంగళమూర్తి! అన్నాను. "జేజె" అన్నాను. వాడు అన్నాడుగదా, మీదేవుడు మంగళమూర్తేనా? అన్నాడు.

తాట: మరివాళ్ల జేజె, భయమంగళాకృతి. పిరికివాళ్ళు, తమ పిరికితనాన్ని తమ "జేజె"కు ఆరోపించుకుంటారులే.

మారీ: వాడు, ఎంతమాటన్నాడనుకున్నావమ్మా. 'దొంగ'లకు, దారికొట్టే దొంగలకు, భయభక్తులెందుకువుంటై! అని వెళ్లాడమ్మా. మన జేజెను నిందించిన, ఆ గడ్డాలవాణ్ణి పట్టుకుని,—

తాట: వాడి నాలుక పెరికి పారవేయలేదూ!

మారీ: నీవేమంటావోనని జంకానమ్మా.

తాట: నిన్ను తిట్టనీ, బాధలేదు. నీ ప్రాణధనం, నీజేజెను—శివుణ్ణి, ఆదిభిక్షువూ పరమేశ్వరుడూ అయిన సదాశివుణ్ణి నిందించినవాడు జీవించకూడదు. నిండుప్రాణుల్ని దయాదాక్షిణ్యాలులేక, కాల్చి వేల్చితినే మందిమూకకు జేజె ఏమిటి? అంతఃకరణ ఏమిటి? నాయనా! వాళ్లని పురమార్చవలె. వాళ్ల నాగరికత పాడుగాను. మనభూములుచొచ్చి, మనలను దొంగలంటారా?

పికస్వర: అమ్మా.

తాట. రావమ్మా. రా, పికస్వరా!

పిక : పచ్చవాళ్ళు, మిడతలగుంపు మనతోటలు పాడుచేస్తున్నారమ్మా, తాటకా.

తాట : అలాగా, మరి మా ద్రాక్షవీధులకు ఏ ఈతిబాధాలేదే.

పిక : అందరూ తాటకలవుతారా? అందరికీ అరి విదారణమైన బలం వుంటుందా? ఇది విన్నావుటమ్మా! నిన్న మావారు శివపూజ చేసి, మాలికలను తలధరించి పోతూంటే- ఒక పచ్చ తీతువుపిట్ట, ఒసే ఆడదానా! అని పలకరించాడుట!

తాట : సోమపానము చేసినందుకు కలిగిన ప్రమత్తత.

పిక : మావారు ధనుస్సు సంధించబోయేసరికి, వాడుగ్రుడ్లు వెళ్ళికిలబెట్టి, లేడి పిల్లవలె పరుగెత్తినాడట.

తాట : ప్రమత్తతకు ప్రతిక్రియ అప్రమత్తత. వేటాడీ, వాడినిచంపవలె. శివా! ఏలతండ్రీ ఈదుర్దిన పరంపరలు. శివా! ఈ పచ్చ మొగలిపువ్వులతోనే ఈ వనభూములు నిండి పోతవా, తండ్రీ!

పిక : అమ్మా. మనను, మన ఆచార వ్యవహారాలనూ వారింత చులకన చేస్తారే—

తాట : అవును. వారి యజ్ఞయాగాదులను మనము ధ్వంసముచేస్తేనే—దీనికి సరియగు విరుగుడు. బలవంతులసిలొంగి బలహీనులము కారాదు. అది ప్రాణములతోచచ్చుట. వారి సోమలతలను మొక్కమొలవనీయకుండ చేయుట, వారి యాగభూములను అపవిత్ర మొనర్చుట, వారి గిరిప్రదేశములను చొర రాని దుర్గములనుగా చేసికోవాలి! శివాలయములను కంటికి రెప్పవోలె కాపాడుకోవాలి! చేయతగినపనులు ఇవి. ఈ కానన భూములిక శివపూజకు పనికిరాని మొగలి పువ్వులడొంకలతో నిండిపోవునా? మన కంఠములలో ప్రాణములున్నంతవరకైనను కారాదు. ఆ నిప్పునకు నీరసముపోయి దీప్తి హెచ్చుతున్నది, సాయం సమయమైనట్లున్నది. శివతాండవోత్సవము చేయవలదా? శివాలయమునకు పోదాము.

3

[విశ్వామిత్రుడు, రాముడు]

విశ్వా : నాయనా! రామా! మారుమాటాడక వినుము. యిది, జాతికి సంబంధించిన విషయము. స్త్రీవధయని శంకింపకుము. స్త్రీని శంకించుట, బాధించుట, హింసించుట కాని పనులు. నిజమే. చేయరాని పనులను చేయించికాని ఉండనీయదు విధి. తాటకను నీవే చంపవలె. ఆమె మనకు కాళరాత్రివంటిది. వృత్ర వధచేసిన మహేంద్రునివలె, నీవామెనుచంపి, జయశ్రీ సమేతుడవుకావలె. ఆమె ఎట్టిదో తెలియునా? వెయ్యిఏనుగులబలము కలది. ఆమె ప్రజలు ఈకానన నివాసులు. ఆమెలేకున్నచో, ఈ సుందరతరప్రదేశములు ఈ స్వర్గకేదారములు మనకు సులభములు. ఆమె ఉన్నచో, మనమిక్కడ జీవింపలేము. రామా! ఇవి బల అతిబల అను అస్త్ర

ములు. వీనిని కైకొని, ఆమెను కడతేర్చుము. ఇది నా ఆదేశము. ఇది మనకు అవశ్యాచరణీయము. నీవు తాటకాకాళరాత్రికి ప్రత్యూషము కావలెనోయి చిట్టితండ్రీ! (కాస్త ఆగి) అస్త్రోపదేశముచేయు వేళ అయినది.

౪

[శివాలయంలో]

తాటక : శివా! కృపాళూ! సాంబశివా! సదా శివా! పట్టరాని ముసురుపట్టినది. నీ లీలలతో, నీ పూజలతో నీ మహోత్సవ క్రీడలతో నిండి, పండి, సమృద్ధములైన ఈ కానన శోభలకు కార్చిచ్చు అంటుకొను వేళ వచ్చినదా? మంగళమూర్తీ! నీభక్తులకా, అమంగళయుగములు! ప్రభూ! ఆదిగర్భేశ్వరా! ఆదిదేవా! మహాదేవా! సులభమూర్తీ! శిశుహృదయా! సదయా! శివా! పరమ శివా! శివా! శివా!

౫

[పెద్దచప్పుడు]

విశ్వా : నాయనా! తాటక మడిసినది. యిక యాగప్రదేశములు రక్తపు మరకలతో అపవిత్రములు కాజాలవు. తాటక బిడ్డడున్నాడు కాని, వాడు, ఒక్క బాణముకుసరి! అమ్మ! తాటక, మడిసినది రామా నీకిప్పుడు, మౌనవ్రతము. ఊహాపరంపరలను చిక్కబట్టు వేళ. ఒక మహోన్నతమగు పనిని సాధించినవారు మాటాడగూడదు.

అరిం : గురుదేవా! తాటక పని అయింది, యిక తరువాత?

విశ్వా : పాపము, తాటక భక్తురాలు. జాతిద్వేష కారణముగా ఆమె చనిపోయినది. రామునకు, నేడు మౌనవ్రతదినము. మనకు మానసిక ఉత్సవ ఆనందము ఇది.

—ఆలిండియా రేడియో అనుమతిని.

ఏదేశచరిత్ర చూచినా, ఏమున్నది గర్వకారణం?
నరజాతిచరిత్ర సమస్తం, పరపీడన పరాయణత్వం
నరజాతిచరిత్ర సమస్తం, పరస్పరాహరణోద్యోగం
నరజాతిచరిత్ర సమస్తం, రణరక్త ప్రవాహసిక్తం.
బలవంతులు దుర్బలజాతిని, బానిసలను కావించారు
నరహంతలు ధరాధిపతులై, చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి"

— శ్రీ శ్రీ —

★